ప్రజాశక్తి
బుధవారం 15 నవంబరు 2023 5 శ్రీకాకుళం



నేడు సామాజిక సాధికార యాత్ర

నరసన్నపేట : వైసిపి చేపట్టిన సామాజిక సాధికార యాత్ర రెండో దశలో భాగంగా ఈనెల 15వ తేదీన నరసన్నపేటలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటలకు పోలాకి మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మధ్యాహ్న భోజన విరామం అనంతరం 1.30 గంటలకు మబగాం నుంచి సామాజిక సాధికార బస్సుయాత్ర బయలుదేరుతుందన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు నరసన్నపేట పట్టణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు జిల్లా మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు.

అప్పుడే మొదలు

జిల్లాలో కోతల దశ ప్రారంభంలోనే దళారులు కొనుగోలు మొదలు పెట్టేశారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లు తెరిస్తే తమకు తక్కువ ధరకు ధాన్యం దొరకదని భావించిన వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని సైతం కొనుగోలుకు వెనుకాడడం లేదు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన వ్యాపారులు గ్రామాల్లోకి వచ్చి దళారుల సాయంతో కొనుగోలు చేస్తున్నారు. పొలాల వద్దకే లారీలను పంపి తరలిస్తున్నారు. రైతులతో బేరాలు సాగించి తమకు నచ్చిన ధరను చెల్లిస్తున్నారు. ధాన్యం రకం ఆధారంగా రేటు ఇస్తున్నారు.

- కోతల ప్రారంభంలోనే వ్యాపారుల కొనుగోళ్లు
- పొలాల వద్దకు వచ్చి కొంటున్న వర్తకులు
- పచ్చి ధాన్యాన్నీ కొనేస్తున్న వైనం
- 80 కేజీల బస్తాకు రూ.1250 చెల్లింపు


బూర్జలో లారీలోకి ధాన్యం బస్తాలను ఎక్కిస్తున్న కూలీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 3,51,843 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. తిండి గింజలు, స్థానిక అవసరాలకు పోనూ మార్కెట్‌లోకి 7.87 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. అందులో 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అధికారులు అందుకనుగుణంగా జిల్లావ్యాప్తంగా 390 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు ఒక్క కేంద్రాన్నీ ఏర్పాటు చేయలేదు. జిల్లాలో జలుమూరు, సారవకోట, బూర్జ తదితర మండలాల్లో పంట కోతలు ముందుగా జరుగుతున్నా, ఇప్పటివరకు కేంద్రాలను తెరవలేదు. ఇదే అదనుగా వ్యాపారులు, దళారులు రంగప్రవేశం చేసి కారుచౌకగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

80 కేజీల బస్తాకు రూ.1250 చెల్లింపు

సాధారణ రకం ధాన్యానికి ప్రభుత్వం 80 కేజీల బస్తాకు రూ.1746.40 మద్దతు ధర చెల్లించాలని నిర్ణయించగా, వ్యాపారులు బస్తాకు రూ.1250 నుంచి రూ.1350 మధ్య మాత్రమే ఇస్తున్నారు. మరోవైపు తూకంలోనూ బేరసారాలు సాగిస్తున్నారు. పచ్చి ధాన్యం పేరుతో అదనంగా మూడు నుంచి ఐదు కేజీలు తీసుకుంటున్నారు.

ఆ ఇబ్బందులు పడలేకే...



నేను నాలుగు ఎకరాల్లో వరి వేశాను. ఈ ఏడాది క్వింటా ధాన్యం వచ్చాయి. బయట వ్యాపారులకు 80 కేజీల బస్తాలను ఒక్కొక్కటి రూ.1250 చొప్పున ఇచ్చేశాను. కొనుగోలు కేంద్రాల మ్యాపింగ్ పేరుతో గతేడాది నరసన్నపేట తీసుకువెళ్లమనడంతో నానా అవస్థలు పడ్డాను. ఈసారి అటువంటి ఇబ్బందులు పడలేకే వ్యాపారులకు ఇవ్వాల్సి వచ్చింది.

- అల్లు ముఖలింగం, బూర్జ

కొనుగోలు కేంద్రానికి తిరగలేక ఇచ్చేశాను



ఈ ఏడాది ఎనిమిది ఎకరాల్లో వరి వేశాను. రెండు ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు 60 బస్తాలను రూ.1250 చొప్పున అమ్మేశాను. గతేడాది 50 బస్తాలను ఆర్‌బికెకు ధాన్యం ఇవ్వడానికి వెళ్లాను. ఆరబెట్టి తేవాలని, ధాన్యం బాగాలేవని రెండు, మూడుసార్లు తిప్పారు. డిసెంబరు చివరి వారంలో ధాన్యం ఇచ్చాను. ఫిబ్రవరి వరకు డబ్బులు వేయలేదు. వీటితో విసిగిపోయి తొందరగా డబ్బులు వస్తాయని బయట వ్యాపారులకు ఇచ్చేశాను.

- శంభాన ఉదయ్‌కుమార్, బూర్జ

కారణాలు ఇవే...

వ్యాపారులు అడిగిన ధరకే ధాన్యం ఇచ్చేయడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఈ సంవత్సరం కరువు పరిస్థితులు తలెత్తడంతో ఇంజిన్ల సాయంతోనే పంటను కాపాడుకుంటూ వచ్చారు. వర్షాభావ పరిస్థితులతో సుడిదోమ వ్యాపించింది. దీంతో దిగుబడి, నాణ్యత కొంతమేర తగ్గినట్లు రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం ఈ ధాన్యాన్ని కొంటుందో, లేదోనన్న సందేహంతో తక్కువ ధరకే తెగనమ్ముకుంటున్నారు. అదీగాక గతేడాది అనుభవంతో వారు వ్యాపారులకు ఇచ్చేందుకే మొగ్గు చూపుతున్నారు. మ్యాపింగ్ పేరుతో రైతులను 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రాలకు పంపారు. వర్షాభావ పరిస్థితులతో ఈ ఖరీఫ్‌లో ఇంజిన్లతో పంటను తడుపుకునేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి రావడంతో, అధికంగా అప్పులు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వానికి ధాన్యం అమ్మితే ఆలస్యంగా డబ్బులు వస్తాయని కొందరు వ్యాపారులకు ఇచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. గతేడాది డిసెంబరులో ధాన్యం ఇస్తే ఫిబ్రవరిలో డబ్బులు వచ్చాయి. ఈ పరిస్థితులను చూసి ఎక్కువ మంది రైతులు వ్యాపారులు, దళారులకు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు.



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ చట్టం రద్దును సహించం

- నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుల డిమాండ్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - పోలాకి

నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని రద్దు చేస్తే సహించేది లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సంఘ నాయకులు టి.లక్ష్మణరావు, బి.సిమ్మయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిలిపివేసిన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను పునరుద్ధరించి, భద్రత లేని కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లపై మబగాంలోని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ క్యాంపు కార్యాలయం ఎదుట నిర్మాణ కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం క్లయిమ్స్‌ను నిలుపుదల చేసి నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ ఖజానాపై పైసా భారం పడకుండా చట్ట ప్రకారం నిర్మాణ యజమానుల నుంచి ఒక శాతం సెస్ వసూలు చేసి, నిర్మాణ కార్మికులకు మరణం, అంగవైకల్యం, వివాహం, ప్రసవం, వైద్య ఖర్చులు వంటి సందర్భాల్లో క్లయిమ్స్ రూపంలో సంక్షేమ చట్టం ద్వారా అందేవన్నారు. దీంతో నిర్మాణ కార్మికులకు కొంతమేరకైనా ఉపశమనం లభించేదని చెప్పారు. నిర్మాణ యజమానుల నుంచి వసూలు చేసిన సెస్ నిధులు నిర్మాణ కార్మికుల కోసమే ఖర్చు చేయాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని చట్టం చెప్తోందని గుర్తుచేశారు. సెస్ వసూలు కొనసాగుతున్నా, చట్ట విరుద్ధంగా క్లయిమ్స్ నిలుపుదల చేసి ఇతర అవసరాలకు ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటోందని తెలిపారు. దీన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ కార్మికులు పలురూపాల్లో ఆందోళనలు చేపట్టారని గుర్తుచేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని క్లయిమ్‌లను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇతర అవసరాలకు మళ్లించిన నిధులను తిరిగి జమ చేయాలన్నారు. భవిష్యత్తులో వసూలైన సెస్ నిధులను నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని, లేకుంటే రాష్ట్రంలోని సుమారు 30 లక్షల మంది నిర్మాణ కార్మికుల కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిర్మాణ కార్మికులు టి.వెంకటరావు, ఎల్.అక్కునాయుడు, ఎస్.ఉమ, పి.రాము, నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు మండలాల నుంచి పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో సహకార రంగం

జిల్లా సహకార అధికారి ఎన్.సుబ్బారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలో సహకార వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉందని, డిజిటలైజేషన్‌ను అన్వయించుకుంటూ మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని జిల్లా సహకార అధికారి నీలం సుబ్బారావు అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పతాకాన్ని ఎగురవేసి సహకార వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి సహకార రంగం ఎంతగానో సహకరిస్తూ ముఖ్య భూమిక పోషిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు వినూత్న సంస్కరణకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో డిసిఎఒ బి.నగేష్, టెక్కలి డివిజన్ డిప్యూటీ రిజిస్ట్రార్ పి.మురళీకృష్ణమూర్తి, శ్రీకాకుళం డివిజన్ డిఎల్‌ఒ కె.దామోదరరావు, డిసిసిబి జిఎం ఎస్.ఎస్ జగదీష్, డిజిఎంలు జి.సునీల్, ఎస్.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జగన్నాయకులు

ఇచ్ఛాపురం : సహకార వ్యవస్థకు జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధుడు పుల్లెల శ్యామసుందరరావు ఊపిరి పోశారని పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్ అన్నారు. స్థానిక పిఎసిఎస్‌లో సహకార వారోత్సవాల్లో భాగంగా పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, కౌన్సిలర్ ప్రతినిధి బుడ్డెపు త్రినాథరెడ్డి, కేదారిపురం సర్పంచ్ నీలాపు సారథిరెడ్డి, డిసిసిబి మేనేజర్ తులసీబాయి తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : లట్టిగాం పిఎసిఎస్ కార్యాలయం వద్ద పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్ పోలాకి మోహనరావు, పిఎస్ఎస్ సభ్యులు కవిటి వీరన్న పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పిలక రవికుమార్‌రెడ్డి, మార్పు నాగభూషణరావు, కోటబొమ్మాళి డిసిసిబి బ్రాంచి మేనేజర్ ఉషాశాంతి, సూపర్‌వైజర్ కవితారాణి, సిఇఒ మాధురి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : సహకార సంఘాల్లో సభ్యులు చేరడం ద్వారా ఆర్థికంగా బలోపేతం అవుతారని మండల వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు అన్నారు. 70వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాల సందర్భంగా పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఇఒ ఎ.జగదీష్, సిబ్బంది కృష్ణ, బసవేశ్వరరావు, జయరాం పాల్గొన్నారు.

కరువు పరిస్థితులు కనిపించడం లేదా?

- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- శ్రీకాకుళంను కరువు జిల్లాగా ప్రకటించాలి
- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఇచ్ఛాపురం మొదలు హిందూపురం వరకు రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా, రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తితో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులకు తోడు సాగునీరు అందించడంలో జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రాజెక్టులపై ఏనాడైనా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. నాలుగేళ్ల కాలంలో ఒక్క పంట కాలువలోనైనా తట్టెడు మట్టి తొలగించిన దాఖలాల్లేవన్నారు. రాష్ట్రంలో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయో, రైతుల సాగు కష్టాలు ఏమిటో వ్యవసాయశాఖ మంత్రికి తెలియదని ఎద్దేవా చేశారు. జిల్లాలో వంశధార, నాగావళి నదుల ఆయకట్టు ప్రాంతంలో నాట్లు వేసి పెట్టుబడులు పెట్టిన రైతాంగానికి సాగునీరందక ఈ ఏడాది పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వర్షపాతం తక్కువ ఉంటుందని ముందు నుంచీ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వానికి పట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో 400కి పైగా మండలాలు కరువుతో అల్లాడుతుంటే, 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి జగన్ ప్రభుత్వం చేతులు దులిపేసుకుందని విమర్శించారు. పంటలు పోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే, వారి బాధలు పట్టించుకోని మంత్రులు బస్సు యాత్ర పేరుతో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. ఆ యాత్రలో కనీసం రైతుల గురించి మాట్లాడిన పాపాన పోలేదన్నారు. వైసిపి జెండా పట్టుకుని ప్రజల్లోకి వెళ్తే చెప్పుతో కొట్టే పరిస్థితి ఉందని తెలిసి, అధికారులను ముందు పెట్టుకుని గ్రామాల్లో ప్రచారానికి వెళుతున్నారని చెప్పారు. కరువు పరిస్థితులతో అల్లాడుతున్న శ్రీకాకుళంను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రకటన చేశాకే ఈనెల 23న సిఎం జగన్ జిల్లాలోకి అడుగు పెట్టాలన్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, స్పీకర్ జిల్లాలో ఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించుకోలేకపోయారని, రైతులపై వారి చిత్తశుద్ధిని ఇది తేటతెల్లం చేస్తోందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు మాదారపు వెంకటేష్, ఎస్.వి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అక్షరంతోనే అభివృద్ధి సాధ్యం

గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు సువ్వారి సువర్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అక్షరంతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సువ్వారి సువర్ణ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల కోసం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం శుభపరిణామన్నారు. గ్రంథాలయాల్లో అందరికీ అందుబాటులో అన్ని పుస్తకాలు ఉంటాయన్నారు. నేటి తరానికి గ్రంథాలయ విశిష్టతను వివరించేందుకు వారోత్సవాలు నిర్వహించుకున్నట్లు తెలిపారు. గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించుకొని గ్రంథాలయానికి రావాలని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా 15న పుస్తక ప్రదర్శనల ఏర్పాటు, మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య తదితరులను స్మరించుకోనున్నట్లు చెప్పారు. 17న కవితా దినోత్సవం, సెమినార్‌లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడల పోటీలు ఉంటాయన్నారు. 19న మహిళా దినోత్సవం, ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాలు 20న అక్షరాస్యతా దినోత్సవం, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఉంటాయని వివరించారు. అంతకుముందు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ (ఢిల్లీ), డాక్టర్ సోమేశ్వరరావు, ఇ.ఎస్ సంపత్ కుమార్, ఉప గ్రంథాలయ అధికారి వి.వి.ఎస్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతుగా నిలవాలి

ప్రజాశక్తి - పొందూరు

నాలుగున్నరేళ్లగా రాష్ట్రంలో సాగుతున్న సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా నిలవాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. మండలంలోని రాపాకలో 'వై ఎపి నీడ్స్ జగన్', కింతలిలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. చిలకపాలెం వద్ద గల ఎన్ఎసిఎల్ పరిశ్రమ వల్ల పొందూరు మండలంలోని పలు గ్రామాల్లో నీరు కలుషితమవుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు నాగావళి నది నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా సమస్య పరిష్కారం కావడం లేదంటూ రాపాకలో పలువురు మహిళలు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. సంక్రాంతి నాటికి ఇంటింటికీ మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేసి, మంచినీరు సరఫరా చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాంతారావు, సర్పంచ్ ప్రతినిధి గిరిబాబు, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్, జి.నాగరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, కింతలి సర్పంచ్, ఎంపిటిసి పైడి రాంప్రసాద్, కూటికుప్పల హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.


కింతలిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని

ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటం

టిడిపి, జనసేన సమన్వయ కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటం సాగిస్తామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు గుండ లక్ష్మీదేవి, జనసేన శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ సర్వేశ్వరరావు తెలిపారు. అరసవల్లిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో టిడిపి, జనసేన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమం పేరిట ప్రజలపై పెద్దఎత్తున భారాలు మోపారని విమర్శించారు. వైసిపి అరాచక పాలనకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కలసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. సమావేశంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


శ్రీకాకుళం అర్బన్ : చిన్నారులతో ఎస్పి రాధిక


ఆమదాలవలస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సత్యవతి


శ్రీకాకుళం : బాలల సంచికను ఆవిష్కరిస్తున్న రజనీకాంతారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాలల దినోత్సవం సందర్భంగా నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఆక్స్‌ఫర్డు స్కూల్‌లో ఉత్తమ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. చదువుతో పాటు క్రమశిక్షణ తదితర అంశాల్లో ఉత్తమంగా నిలిచిన డి.గోవర్ధన్, జాహ్నవి, కె.ఎల్.ప్రసన్న, కె.యామిని, సిహెచ్ సోమశ్రీ, జి.సాయి రోహిత్, బి.లలిత్ కిరణ్, బిజెఎస్ కిరణ్మయి, పి.యు వి.పద్మిని, జి. మోహన్ కృష్ణలను ఉత్తమ విద్యార్థి పురస్కారంతో సత్కరించారు. ఎస్‌పి జి.ఆర్.రాధిక ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు మంచిగా ఆటలు ఆడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా విజయనగరానికి చెందిన అంధుల సంస్థకు పాటశాల విద్యార్థులు రూ.21,500 లను ఎస్‌పి చేతుల మీదుగా వితరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు ఎ.రమేష్ బాబు, ఎ.లావణ్య రాణి, ప్రిన్సిపాల్ బి.కిరణ్ కుమార్‌లతో పాటు కో-ఆర్డినేటర్‌లు దీప కుమారి, దేవి, విజయలతో పాటు తల్లి తండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యాన తలసేమియా, హెచ్ఐవి, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో బృందావన్ హాల్లో నిర్వహించిన ఈశిబిరాన్ని ఎఎస్పి (క్రైమ్) టిపి విఠలేశ్వరరావు, నగర మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఐసిడిఎస్ పిడి బి.శాంతిశ్రీలు ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ (డ్రై ఫ్రూట్స్, గ్లూకోజ్, ప్రోటీన్ పౌడర్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ డాక్టరు ఎన్.అనూరాధ, డ్రగ్ కంట్రోల్ అధికారి ఎం.చంద్రరావు, న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజరు డా. తొత్తడి మణికంఠరావు, శాసపు జోగి నాయుడు, ప్రెసిడెంట్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, లైన్స్ క్లబ్ హర్షవర్ధ ప్రెసిడెంట్ హరిక ప్రసాద్ పాల్గొన్నారు.

గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో నిర్వహించిన కార్యక్రమంలో విగ్రహదాత లోలుగు మదన్మోహన్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పొగిరి సుగుణాకరరావు, డాక్టర్ జామి భీమశంకర్, బరాటం లక్ష్మణరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, మహిబుల్లాఖాన్, హరిక ప్రసాద్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ పౌరులని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆమె స్వగృహంలో చిన్నారులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. చిన్నారులకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ స్కూల్ కరస్పాండెంట్ పేడాడ వైకుంఠరావు, ప్రిన్సిపాల్ పేడాడ శ్రీధర్ (బుజ్జి), కాంగ్రెస్ నాయకులు అభినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, పప్పల వెంకటరమణ, అభినేని సాయిరాం, బొత్స రమణ, దాలయ్య, అప్పారావు, శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్జ: మండలం చీడివలస గ్రామంలో ఎంపియుపి పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ జన్మదిన విశిష్టత, బాలల దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటేశ్వరావు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొత్తకోట సింహాద్రి నాయుడు, కె.లక్ష్మి, వై.సూర్యనారాయణ, ఎం.గణేష్ పాల్గొన్నారు.

ఫోటో: మాట్లాడుతున్న సింహాద్రి నాయుడు

పొందూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే భవిత కేంద్రంలో బాలల దినోత్సవం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు రాధారాణి, దినేష్, ఫిజియోథెరిఫీ రమ్య, ప్రియాంక పాల్గొన్నారు. మండలంలో కింతలి ఎంపిపి పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా పిసిసి ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణరావు, చిన్నారులకు మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

జి.సిగడాం: మండలంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అద్దనంపేట ప్రాథమిక పాఠశాల, ఆదర్శ పాఠశాల, కెజిబివి, పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కోరుకొండ కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ట్వింకిల్ కిడ్స్ స్కూల్లో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ పాల్గొని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ట్వింకిల్ కిడ్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు రాధా, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. బాలల దినోత్సవం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గొప్పిలి, కరజాడ, పెద్దమడి, పిఎల్ పురం, పెద్ద పద్మాపురం, బందపల్లి, చాపర తదితర ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో బాలల దినోత్సవ కార్యక్రమం జరిగింది.

సంతబొమ్మాళి : జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు టి.లోకేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జి.జగదాంబ, బి.శ్రీనివాసరావులను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సందేశాత్మక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

కవిటి: ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంపిపి పాఠశాల, కుసుంపురం, కవిటి బివికె, ఎస్వీజె విద్యా సంస్థలు, కల్యాణి ఆంగ్ల, జగతి, నెలవంగ జిల్లా పరిషత్ ఉన్నత, నెలవంక ప్రాథమిక పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, సభ్యులు ఆరింగి మధు, పొల్లాయి లక్ష్మణమూర్తి, పులకల వెంకటరావు, భావన రవి పాల్గొన్నారు.

టెక్కలి : మాజీ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుక మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డు ప్రాథమికోన్నత బజారు పాఠశాల ఆవరణలో ఉన్న నెహ్రూ విగ్రహానికి డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లౌకికవాదం విధానాన్ని అభివృద్ధి చేసింది నెహ్రూ అని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోత మధుసూదనరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్నూరు ఆనందరావు, హెచ్ఎం ఎం.బాలయ్య, ఆర్.సూర్యకుమారి, చైర్మన్ బర్ల అపర్ణ పాల్గొన్నారు.

మండలంలోని నరసింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అనురాధ, విలియం వాక్యాన్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మధులత, రవీంద్ర భారతి పాఠశాల ఆవరణలో పద్మజ ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ నెహ్రూ చిత్రపటానికి పూలమాలల్ వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఓ.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎస్.దుర్గారావు, వై.రమేష్ పాల్గొన్నారు. అలాగే స్థానిక ఓక్లాండ్ పాఠశాల ప్రిన్సిపాల్ మళ్లా మధులత ఆధ్వర్యాన నిర్వహించిన బాలల దినోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

నౌపడ : దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్ఎం వీరభద్రరావు ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలో కార్యదర్శి జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన మినీ బజార్ స్టాల్‌లు ఆకట్టుకున్నాయి. స్వర్ణభారతి విద్యా సంస్థలో చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, శాంతి నికేతన్ విద్యా సంస్థలో చైర్మన్ దక్కత కృష్ణమూర్తి, భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త నరసమ్మ ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించారు.

కొత్తూరు : ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో తూర్పుకాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే కెజిబివి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బెడ్స్ సంస్థ కైలాష్, సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షులు జి.జగన్నాథరావు, సర్పంచ్ పడాల కృష్ణవేణి, ఎంపిటిసి జి.తర్నకుమారి, హెచ్‌ఎంలె ఎ.గోవిందరావు, ప్రసాదరావు, గోగుల వరప్రసాదరావు నాయుడు, జి.ఆనందరావు, పి.లక్ష్మణరావు, కె.శ్రీరాములు, ఉషారాణి, రమణమ్మ, జ్యోతి పాల్గొన్నారు.


శ్రీకాకుళం : చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న దానేటి శ్రీధర్


ఎచ్చెర్ల : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఆచారి


పొందూరు : బహుమతులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎల్ఐసి ఉద్యోగి టేకి ఆచారి ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి బగ్గు రాజారావు, ప్రకాష్, నందీశ్వరరావు, శశి, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెహర్ విద్యా విహార్‌లో...

శ్రీకాకుళం : పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పి.ఎన్ కాలనీలోని మెహర్ విద్యా విహార్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత జెసి పి.రజనీకాంతరావు పాల్గొన్నారు. 'ప్రజాశక్తి' నిర్వహించిన ప్రత్యేక బాలల సంచికను ఆవిష్కరించి అందరికీ కాపీలను అందజేశారు. కరస్పాండెంట్ వి.కామేశ్వరరావు, డైరెక్టర్ బరాటం లక్ష్మణరవు, డి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌడీలుగా ముద్ర వేస్తే సహించం


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తమ గ్రామస్తులను రౌడీలని, గుండాలని ముద్రవేస్తే సహించేది లేదని మంచినీళ్లపేట సర్పంచ్ వంక సత్యరాజు, వైస్ ఎంపిపి వంక రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీళ్లపేట సముద్రతీరంలో గ్రామస్తులతో కలసి వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రౌడీలు, గుండాలంటూ విషపు రాతలు రాయించినందుకే గౌతు శిరీషను తన గ్రామానికి రాకుండా అడ్డుకున్నామని తెలిపారు. సమాధానం చెప్పకుండా వెనుతిరిగిన శిరీష మళ్లీ అవే పదాలు ఉపయోగిస్తున్నారని అన్నారు. ఇలాగైతే గ్రామాల్లో తిరగనివ్వబోమని వారు హెచ్చరించారు. మంత్రి ప్రమేయంతో తాము అడ్డుకున్నామని దుష్ప్రచారం చేయడం నిందలు వేయడం సరికాదని హితవు పలికారు. మంత్రి ప్రమేయం ఉంటే ఆమెను ఊర్లోకి అడుగు పెట్టించే వాళ్లమే కాదన్నారు. గౌతు శిరీష గ్రామంలో గొడవలు పెట్టడానికే వస్తున్నారే తప్ప వేరే ఉద్దేశం ఆమెకు లేదని అన్నారు. ఆమె తమ గ్రామ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. టిడిపి నాయకులు మంచి కోరే వారైతే తమ గ్రామంలోని మాజీ సర్పంచ్ చిన్నారావు రూ.40 లక్షల గ్రామస్తుల సొమ్ము తన వద్ద అంటి పెట్టుకున్నారని, దానిని పంచాయతీకి అప్పజెప్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు గౌతు కుటుంబం ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. మంత్రి అప్పలరాజు మంచినీళ్లపేట జెట్టీని ఫిషింగ్ హార్బర్‌గా అభివృద్ధి చేస్తున్నారని, మూలపేరు పోర్టును నిర్మిస్తున్నారని అన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన తుపాను భవనాలు పశువులు కొట్టంగా పనిచేస్తుంది తప్ప ప్రజలకు ఉపయోగ లేకుండా చేశారని దుమ్మెత్తి పోశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంభురావు, బి.శంకర్, ఏసులు, చింతల దానేష్, సాంబమూర్తి, మోహనరావు పాల్గొన్నారు.


మంత్రి ప్రోద్బలంతోనే శిరీష అడ్డగింత


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వజ్రపుకొత్తూరు: పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రోద్బలంతోనే మంచినీళ్లపేటలో వైసిపి నాయకులు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను అడ్డుకున్నారని టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, మాజీ ఎంపిపి జి.వసంతస్వామి అన్నారు. మండలంలోని పూండిలో టిడిపి నాయకులతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంచినీళ్లపేటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన శిరీషను అడ్డుకోవాలని స్థానిక నాయకులు ప్రయత్నం చేయడం ఫ్యాక్షన్ రాజకీయాలను తలపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు సంయమనం పాటిస్తుంటే... అదే పనిగా మంత్రి రౌడీయిజాన్ని ప్రోత్సాహించడం దురదష్టకరమని అన్నారు. ఐదేళ్లుగా వంశధార నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే... మంత్రి ఏనాడైనా స్పందించారా? అని ప్రశ్నించారు. కాలువల్లో పూడికతీత పనులు ఈ ఐదేళ్లలో ఎప్పుడైనా చేపట్టారా? అని ప్రశ్నించారు. పూండి రోడ్డుపై నిత్యం సొంతూరు వెళ్తారా? మంత్రి స్వగ్రామానికి వెళ్లే రోడ్లు ఇలాగే ఉంటుందని వ్యాఖ్యానించారు. కులాలు, కుటుంబాలు మధ్య చిచ్చుపెట్టి పగ్గం గడుపుకోవాలనే మంత్రి దురాలోచన మానుకోవాలని హితవుపలికారు. జీడి పిక్కలు ధరలు రూ.14 వేలు ఉంటే... ఇప్పుడు రూ.8 వేలుకు ప్రకటించడం రైతులను దగా చేయడమే అన్నారు. టిడిపి నాయకులను అడ్డుకుంటే ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు కర్ని రమణ, గొరకల వసంతరావు, ఎ.ఉమామహేశ్వరరావు, గర్తం దానేసు, రాపాక శాంతమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పర్యవేక్షణ తప్పనిసరి

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ప్రతినెలా హాజరవుతున్న సముదాయాలకు సంబంధించిన పర్యవేక్షణ తప్పనిసరిగా చేపట్టాలని ఎపి సమగ్ర విద్యా బోధన రాష్ట్ర పరిశీలకులు ఎ.ప్రవీణ్‌కుమార్ సూచించారు. లిప్‌లో భాగంగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బోధన చేపట్టే ఉపాధ్యాయులు విద్యార్థులకు చదవడంతో పాటు రాయడంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాఠశాలల సముదాయాల్లో ఉపాధ్యాయులు చర్చించుకునే అంశాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు అనుసంధానంగా బోధన చేపట్టాలన్నారు. కోర్సు డైరెక్టర్‌గా టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిని గార పగడాలమ్మ, డిఆర్‌పిగా నలినీ కాంతారావు వ్యవహరించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రవీణ్ కుమార్

కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, సవర దేవేంద్రావు, మల్లారెడ్డి పద్మనాభం, డి.చిన్నవాడు, ఎ.చిన్నారావు, డివిజన్‌లోని 16 మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపులి కలకలం

టెక్కలి రూరల్ : మండలంలోని జీడిపేట-భీంపురం గ్రామంలోని ఓ కొండపై మంగళవారం పెద్దపులి సంచారం కలకలం రేపింది. భీంపురం, జీడిపేట గ్రామాల మధ్య ఉన్న కొండపై పులి సంచరించడం గమనించిన గ్రామస్తులు కేకలు వేస్తూ ఉరుకులు, పరుగులు తీశారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో గ్రామానికి చేరుకొని పులి అడుగులని గుర్తించారు. భీంపురం, జీడిపేట ప్రాంతాల్లో పులి సంచరిస్తుందని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు.


శ్రీకాకుళం : నగదు అందజేస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు

భావి భారత నిర్మాతలు బాలలే

ప్రజాశక్తి- శ్రీకాకుళం

భావి భారత నిర్మాతలు బాలలే అని డిఇఒ వెంకటేశ్వరరావు అన్నారు. పి.ఎన్ కాలనీలోని శ్రీసాయి విద్యా మందిర్‌లో మంగళవారం నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 120 మంది విద్యార్థులు రూ.71,267 విరాళాల రూపంలో సేకరించి నగదును డిఇఒ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరగాపు లక్ష్మణరావు చేతుల మీదుగా విశాఖపట్నం రాగనేత్ర బ్లైండ్ డిజెబుల్డ్ సొసైటీ సెక్రటరీ ఈశ్వరరావుకు అందజేశారు. పాఠశాలలో విద్యతో పాటు విలువలు, సామాజిక బాధ్యతలు, సేవా కార్యక్రమాలు నేర్పించడంతో ముందు ఉంటున్నారని మరోసారి రుజువు చేసిందని ఈశ్వరరావు కొనియాడారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రెటరీ సీపాన లక్ష్మి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పైడి పాండురంగారావు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, తవిటిరాజు, క్యాంపస్ ఇన్‌ఛార్జి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పాఠశాలకు 'అరబిందో' ఆర్థికసాయం

రణస్థలం: స్థానిక జెఆర్.పురం ఉన్నత పాఠశాలకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు గ్రామీణ ప్రాంత పాఠశాలల విద్యార్థులు క్రీడా నైపుణ్యాల అభివృద్ధికి, క్రీడా కార్యక్రమాల నిర్వహణ సమయంలో జరిగే ఖర్చులకు ఆర్థిక సహాయంగా రూ.1.50 లక్షలు మంగళవారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం ఏ అవసరం ఉందన్నా తక్షణమే స్పందించి ఆదుకోవడం చాలా అభినందనీయమన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, రణస్థలం జడ్‌పిటిసి టొంపల సీతారాం, అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి విద్యార్థి మృతి


సాయికుమార్ (ఫైల్)

సోంపేట: సోంపేట ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మంగళవారం బస్సు వెనుక చక్రాల కింద పడి ఇంటర్ చదువుతున్న విద్యార్థి సాయికుమార్ బెహరా (18) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొరంజిభద్రకు చెందిన విద్యార్థి సాయి కుమార్ బెహరా సోంపేటలోని ఓ ప్రయివేటు జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజు లాగానే ఉదయం ఇంటి దగ్గర బయలుదేరి కళాశాలకు వచ్చాడు. తరగతులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లేందుకు సాయంత్రం కాంప్లెక్స్‌కు వచ్చాడు. ఇంతలో గ్రామానికి వెళ్లే బస్సు వచ్చింది. అందరితో పాటు బస్సులో కూర్చోవడానికి సీటు కోసం పరుగున వెళ్లాడు. బస్సు రన్నింగ్‌లో ఉంటుండగా... కిటికీలో నుంచి సీటులో పుస్తకాలు వేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో జారిపడి బస్సు వెనుక చక్రాల కిందకు పడిపోవడంతో ఆయనపై నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు 108లో బరంపురం తీసుకెళ్లారు. మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని తండ్రి రామారావు తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. తల్లి రేవతి గృహిణి, 8వ తరగతి చదువుతున్న తమ్ముడు జస్వంత్ ఉన్నాడు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ఎచ్చెర్ల : ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

పలాస : పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని పలాస ఎంపిడిఒ రమేష్ నాయుడు, ఎంఇఒ-2 ఎం.సత్యం, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పలాస శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెహ్రూ జన్మదిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించి గ్రంథాలయ వారోత్సవంలో ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్ కిరణ్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాన్ని ఎంపిపి అట్ల సరోజనమ్మ ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి, సర్పంచ్ గొండేల సుజాత, ఎంపిటిసి కూన పార్వతి పాల్గొన్నారు.

పోలాకి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచ్ మజ్జి రవణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.మానస, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.త్రినాథరావు, మాజీ సర్పంచ్ ఎల్.రాంబాబు, బిడిఒ పివిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను డిటి హరిబాబు ప్రారంభించారు. గ్రంథాలయంలో సాహిత్యం, సైన్స్, గణితం, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా, ప్రభుత్వ స్కూల్ పీడీ గణేష్, శారద, లత పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో గ్రంథాలయానికి శాశ్వతత భవనానికి కృషి చేస్తానని స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. ఈ మేరకు గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బుజ్జి, ఇర్రి చిరంజీవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో...

శ్రీకాకుళం: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ ప్రారంభించారు. తొలుత ఎస్ఆర్ రంగనాథన్, మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూల మాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖనం, వక్తృత్వం, బుక్స్ మీద ట్రెజర్ హంట్, పుస్తక ప్రదర్శన, క్విజ్ వంటి పోటీలను నిర్వహిస్తున్నామని, ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ మజ్జి శ్రీనివాసరావు, కంప్యూటర్ విభాగాధిపతి ప్రసాదరావు, లైబ్రేరియన్ పి.వై.కమల్ కుమార్ పాల్గొన్నారు.

బలగ : బలగ శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన్ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కూన వేణుగోపాలరావు, మానవ హక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉరిట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వేణుగోపాలరావు, మాజీ కౌన్సిలర్ ఆబోతు రామ్మోహనరావు, జీవశాస్త్రం అధ్యాపకులు పున్నారావు, సహాయకలు కె.అనిత పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయములో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మండల విద్యాశాఖాధికారి మురళీకృష్ణ ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి శాఖా గ్రంథాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, భగవాన్, రమేష్ పాల్గొన్నారు.


లావేరు : మాట్లాడుతున్న ఎంఇఒ మురళీకృష్ణ

ఎచ్చెర్ల: మండలం ధర్మవరం శాఖాగ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ అల్లు కన్నబాబు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి బగ్గు రాజారావు, హెచ్ఎం హరికృష్ణ, ఉపాధ్యాయులు రఘునాథరావు, యువ నాయకుడు రుప్ప రమేష్, అసిరితల్లి యువజన సంఘ సభ్యులు రుప్ప లక్ష్మీనాయుడు, అరసవిల్లి వెంకటరమణ, కునుకు వాసు, చల్ల అప్పలసూరి, కరస్పాండెంట్ ఎం.జయరాం, గ్రంథాలయాధికారి మల్లిపెద్ది చంద్రశేఖర్, బి. సూర్యనారాయణ, యువజన సంఘ సభ్యులు జగదీష్, సురేష్, ప్రకాష్, మధు, మహేష్, పొన్నాడ సూరిబాబు, కుప్పిలి సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని కొండ ములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నెహ్రూ జన్మదినం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గల ఆదర్శ గ్రంథాలయంలో బాలలకు వివిధ పోటీలు పెట్టారు. ఉపాధ్యాయులు జోత్స్న నిర్వహణలో నాటికను 6 తరగతి విద్యార్థినులు బి.లక్ష్మి ప్రసన్న, ఎం.వినోషిని, పి.మేఘన, ప్రియ, కె. వాసివి, వై.చైత్ర నటించారు. అలాగే ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి. కృష్ణ ఆధ్వర్యంలో బాలలను ఉత్తేజ పరచడానికి బ్రెడ్స్ ఆర్గనైజేషన్ మండల ఆర్గనైజరు తేజ, జెఆర్‌పురం-2 మహిళా పోలీస్ నాగమణి బాల్యవివాహాలు అరికట్టడంలో విద్యార్థులు పాల్గొనాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పొందూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పొందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ రేగడి లక్ష్మి, ఎంఇఒ-2 పట్నాన రాజారావులు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో యంగ్‌స్టార్ యూత్ అసోసియేషన్ సీనియర్ సభ్యులు కాళ్లకూరి శాంతారాం, సంఘ సేవకులు రాజు, ప్రముఖ రచయిత జి.ప్రభాకర్, ఒడిసి నిర్వాహకులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: స్థానిక గ్రంథాలయంలో పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం వేడుకలతో పాటు గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక నందికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థి విద్యార్థినిలు, ఉపాధ్యాయులు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. అలాగే రొట్టవలస, సరుబుజ్జిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ వెంకట సాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బగాది రమణమూర్తి ఉన్నారు.

జి. సిగడాం: స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరిశ్వరరావు, విఆర్ఒ బి.నర్సింగరావు, విఆర్ఎ వినోద్, కెజిబివి పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మి, శ్రీలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది ఎన్. దుర్గారావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానికశాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి మాజీ ఎంపిపి మాడుగుల రామారావు గ్రంథాలయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కీర్తిశేషులు వైద్యులు మడే రమేష్ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని అమలపాడులో సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రమేష్ ప్రథమ వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. వైద్యునిగా, మంత్రిగా తనకు రమేష్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. రమేష్ పలాస ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్‌గా సమర్ధవంతంగా సేవలు అందింఅచరని అన్నారు. ద్దానం ప్రజలపై చాలా ప్రేమాభిమానాలు చూపించే వారన్నారు. ఆ కుటుంబానికి ఏ అవసరం ఉన్నా తానున్నానని భరోసా ఇచ్చారు. ముందుగా రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ్రమేష్ భార్య డాక్టర్ లక్ష్మీప్రసన్న, కుమార్తె స్తాయిర్య, ఎంపిటిసి దున్న అరుద్రమ్మ, సీడాప్ రాష్ట్ర చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిన లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

యాదవుల సంక్షేమానికి టిడిపి కృషి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- పోలాకి

యాదవుల సంక్షేమానికి టిడిపి కృషి చేసిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని ఈదులవలస కూడలి వద్ద జిఎన్ఆర్ ఫంక్షన్ మంగళవారం యాదవ సాధికారిత సమితి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసు నాయిడు, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లేశ్వర్, యాదవ సాధికారిత పార్లమెంట్ కమిటీ కన్వీనర్ ఇప్పిలి జగదేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు లోడగల కామేశ్వరరావు, పిట్టా అప్పారావు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు తోనంగి వెంకన్న యాదవ్, అధికార ప్రతినిధి దాసరి తాతారావు, నియోజకవర్గ కన్వీనర్ తన్ని అసిరినాయుడు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థం

ప్రజాశక్తి- టెక్కలి

బాల్య వివాహాలు అనర్థమని, ఇందుకు సంబంధించిన చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి మళ్లా అన్నారు. స్థానిక ఇన్‌ఫ్యాంట్ ప్రయివేటు పాఠశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము చదువుకుంటున్న పాఠశాలల పరిసరాలు, తరగతి గదులపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకోవాల్సిన ఆవసరం ఉందన్నారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణం ఉండాలన్నారు. ముందుగా నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సదస్సులో బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు పి.మధుబాబు, దవళ రాజేశ్వరరావు, పొట్నూరు ఆనందరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎలియమ్మ ఇషాక్, ఎస్ఐ ఎల్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆమదాలవలస : వివాహ వయస్సు రాకుండా పెళ్లి చేయడం వలన ఆడపిల్లలు ఎన్నో అనర్థాల బారిన పడతారని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కె. వనజాక్షి అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థినులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ మహిళా సంక్షేమ అధికారిని ఎస్. స్నేహ విద్యార్థినులతో బాల్యవివాహాల నిర్మూలనకై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

సామాజిక సాధికారిక బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని కృష్ణాపురం, ఎర్రవరం, తెప్పలవలస గ్రామాల్లో మంగళవారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్ర కార్యక్రమం చిలకపాలెం గ్రామంలో ఈ నెల 27న జరుగుతుందని, ఈ కార్యక్రమం జయప్రదం చేసేందుకు వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, నాయకులు గొర్లె అప్పలనర్సునాయుడు, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు మహంతి చిన్నరామునాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ఎచ్చెర్ల: వారంతా నేడు ప్రభుత్వ అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా, పలు సంస్థలకు సిఇఒలుగా ఉన్నారు. ఉద్యోగాలు, వ్యాపకాల్లో అత్యంత బిజీగా ఉంటూ తమ జీవన పయనం సాగిస్తున్నారు. తమ ఉన్నతికి, ఉజ్వల భవిష్యత్‌కు బాసటగా నిలిచిన తమ పాఠశాలను, అప్పటి ఉపాధ్యాయులను మరిచిపోలేదు. తమ గుండెల్లో నింపుకున్న ప్రేమానురాగాలను ఒకసారి అప్పటి, ఇప్పటి ఉపాధ్యాయులు, నేటితరం విద్యార్థులతో పంచుకుందామని తలచారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారంతా మంగళవారం ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం గురుకుల పాఠశాలలో కలుసుకున్నారు 1982 నుంచి 2022 వరకూ నాలుగు దశాబ్ధాలు పాటు చదివిన వీరంతా తొలిసారిగాకలుసుకొని తొలుత ఒక సంఘంగా ఏర్పడ్డారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయుల సమక్షంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు

పశువుల అక్రమ రవాణా వ్యాన్లు సీజ్

కొత్తూరు : మండలంలోని బలద సంతలో వ్యాపారులు మంగళవారం పశువులను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వ్యాన్లను స్థానిక నాలుగు రోడ్డుల కూడలి వద్ద ఎస్ఐ అహ్మద్ పట్టుకున్నారు. మంగళవారం తనిఖీ నిర్వహిస్తుండగా రెండు వ్యాన్లలో పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ పశువులను విజయనగరం జిల్లా కొత్తవలస పశువుల కేంద్రానికి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



కంచిలి : పోస్టర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కంచిలి

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గంలోని రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారని, ప్రభుత్వానికి రైతుల బాధలు కనిపించకపోవడం దారుణమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని బోగాబెని పంచాయతీలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ఆదరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని రైతులతో కలిసి వారి పొలాలను పరిశీలించారు. వర్షాలు లేకపోవడంతో పంట పొలాలన్నీ ఎండిపోయాయని, ఇప్పటి వరకు అధికారులు పంట నష్టం నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వాస్తవ పరిశీలన చేసి కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపకలో రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. డ్రోన్ సర్వే, శాటిలైట్ సమాచారం అంటూ తప్పుడు నివేదికలు ఇవ్వకుండా రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాదిన రామారావు, పురుషోత్తం రెడ్డి, మద్దిల కేశవరావు, మద్దిల ఆనంద్, ఎం.ఎం.పట్నాయక్, బి.కురయ్య, కె.కురయ్యా, బాబూరావు, ఎం.ప్రదీప్, శోభన్ పాల్గొన్నారు.

లావేరు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, వైసిపి అరాచక ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో తరిమి కొట్టాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు అన్నారు. మంగళవారం మండలంలోని తామాడ, లక్ష్మిపురం పంచాయతీల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టంచారన్నారు. మరలా టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అభివృద్ధి పదాన నిలుపుతారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ప్రధాన కార్యదర్శి పి. మధుబాబు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి గొర్లె శ్రీనివాసురావు, బాసి గోవింద రెడ్డి, మజ్జి రామ్మూర్తి, రమణనాయుడు, ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలోని నౌపడ, పాలనాయుడుపేట గ్రామాల్లో టిడిపి నాయకులు బాబు ష్యూరిటి - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలో వస్తే అమలు చేసే పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో కర్రి విష్ణుమూర్తి, జీరు భీమారావు, అసిరినాయుడు, సుబ్బారావు, నాగేష్, రామిరెడ్డి పాల్గొన్నారు.

పలాస: వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం, డెంకి వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిచంద్రబాబు నాయుడు చేపట్టనున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, బి.నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు టంకాల రవిశంకర్‌గుప్తా పాల్గొన్నారు.



లావేరు : పోస్టర్లను అందజేస్తున్న మాజీ మంత్రి కళావెంకటరావు

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట పంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో టిడిపి నాయకులు మక్క లక్ష్మనరావు, రాజమహంతి శ్రీనివాస్, శ్రీనివాసరావు, రామిరెడ్డి, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం చీపుర్లపాడు, హరిశ్చంద్రపురం, తిలారు, సరియాపల్లి గ్రామాల్లో పోస్టర్లను అందజేశారు.

పొందూరు: మండలం బురిడికంచరాం గ్రామంలో మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అధికారంలోకి వస్తే అందజేసే పలు పథకాలను వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వండాన మురళీ, కిరణ్, రమణ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



బూర్జ : మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం మండలం మామిడివలస గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గత నాలుగేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని అన్ని ప్రాంతాల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని, ప్రతిపక్షాలు వైసిపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైసిపి సర్కార్‌కే దక్కిందన్నారు. ఏదైనా కారణంతో సంక్షేమ పథకాలు అమలు కాకపోతే, అందుకు అవసరమైన ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేయడం జరిగిందన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మామొర ఆలకించండి మహా ప్రభో....

గ్రామంలో సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని మామిడివలస గ్రామస్తులు స్పీకర్ వద్ద మొరపెట్టుకున్నారు. గ్రామంలో వీధి కాలువలు లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుందని, రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి బిల్లులు చెల్లించాలని పైల ఆదిలక్ష్మి కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి జెజ్జిపురపు రామారావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, సర్పంచ్ కొబాగాన రామకృష్ణ, సాకేటి శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు గోపీనాథ్ సాహెూ పాల్గొన్నారు.



మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని గోకర్ణాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమవుతాయన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, జయమునిరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పర్లాకిమిడి : వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పూర్తిగా ఎండిపోయాయని, తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఎఐకెఎంఎస్ జాతీయ కార్యదర్శి బాలచంద్ర షడంగి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి గజపతి జిల్లా పర్లాకిమిడి కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆవరణలో ఆందోళన చేపట్టి మాట్లాడారు. ఆదివాసీలు సాగు చేస్తున్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. రైతుల అన్ని రుణాలనూ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేదార్ సబర్, ఒడిశా రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కార్మిక సంఘాల కన్వీనర్ ప్రతాప్ ప్రధాన్, కరుక సబర్, శంభు సబర్ పాల్గొన్నారు.



బోర్డును అందజేస్తున్న చిరంజీవి

టేబుల్ టెన్నిస్ బోర్డు వితరణ

ఇచ్ఛాపురం: స్థానిక పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలకు బాలల దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఆఫీసర్ లింగం చిరంజీవి రూ.30 వేలు విలువైన టేబుల్ టెన్నిస్ బోర్డులను మంగళవారం వితరణగా అందజేశారు. విద్యార్థులకు క్రీడలపై మరింత ఉత్సాహాన్ని పెంపొందించడానికి ఈ టేబుల్ టెన్నిస్ బోర్డు ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటివరకు తేబుల్ టెన్నిస్ బోర్డు లేకపోవడంతో విద్యార్థులు ఆడుకోవడానికి వీలులేకపోయిందని, ఆ కోరిక చిరుజీవి ద్వారా తీరిందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ తెలియజేశారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలో తైక్వాండో జిల్లా సెక్రటరీ దుర్గాప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ వైస్ చైర్మన్ అనూష పాల్గొన్నారు.

శిరీషను అడ్డుకోవడం సరికాదు

పలాస : వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నేందుకు వెళ్తుండగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను అడ్డుకోవడం సరికాదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఖండించారు. మంగళవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రోద్భలంతో వైస్ ఎంపిపి రాజు, ఎంపిటిసిలు శిరీష కారును అడ్డగించి దాడి దిగారని అన్నారు. ప్రతిపక్ష నాయకులకు వైసిపి ప్రభుత్వంలో రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అని చూడకుండా మూకుమ్మడిగా దాడి చేయడానికి ప్రయత్నించడం తగదని హితవుపలికారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవి, యవ్వారి మోహనరావు, కొత్త సత్యం. పైల చక్రధర్, శాసనపురి మోహనరావు, కొవ్వూరు సురేష్, శ్రీనివాసరావు, గోల చంద్రరావు, జోగ మల్లీలు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి ముందుకు రావాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో కొండములు గ్రామ సమీపంలో 30 పడకల ఆస్పత్రి(సిహెచ్‌సి)ని అభివృద్ధికి మండలంలో ఉన్న పరిశ్రమ యాజమాన్యాలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందజేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సిహెచ్‌సిలో సూపరింటిండెంట్ ఎంవి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఈ ఆస్పత్రికి అరబిందో ఫార్మాసిటికల్స్ పరిశ్రమ యాజమాన్యం రూ.12 లక్షలు అందించి ఆస్పత్రిలో పరికరాలు, ఫర్నిఛర్, వాటర్ ప్లాంట్ తదితర వస్తువులు సమకూర్చడం జరిగిందన్నారు. మిగతా పరిశ్రమ యాజమాన్యాలు స్పందించి రోజుకి 300 ఒపి ఉన్న ఆస్పత్రికి అంబులెన్స్ సదుపాయం లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని అంబులెన్స్ సమకుర్చాలని కోరారు. అలాగే ఎక్స్‌రే మిషన్లు ఉన్నప్పటికీ ప్రత్యేక గది లేకపోవడంతో ఎక్స్‌రే మిషన్లు మూలకు చేరాయని, ఎక్స్‌రే మిషన్లు ఏర్పాటుకు ఒక గది నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఆస్పత్రికి త్రిఫేస్ విద్యుత్,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు మహంతి చిన్నరాము నాయుడు, మహిళా అధ్యక్షులు గురాన మానస, సర్పంచ్ ప్రతినిధి గొర్లె అప్పలనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి రెడ్డి వాసు, ఆస్పత్రి కమిటీ సభ్యులు కలిశెట్టి కన్నంనాయుడు, పిప్పళ్ల వెంకటేష్, వైసిపి నాయకులు కంబపు రామిరెడ్డి, పచ్చిగుళ్ల సాయిరాం, పిన్నింటి లక్ష్మునాయుడు, వైసిపి నాయకులు, ఎంపిడిఒ రమణమూర్తి, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

120 మందికి మధుమేహ వైద్య పరీక్షలు



పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నగరంలో పాత బస్టాండ్ వద్ద గల మెడిసిన్ బ్యాంక్‌లో మధుమేహ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ కెల్లి చిన్నబాబు, డాక్టర్ చంద్ర శేఖర్ హాజరై 120 మందికి ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఒ కె. బాలమాన్ సింగ్, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు నిక్కు అప్పన్న, పి.శ్రీకాంత్, ఎం.కళ్యాణ చక్రవర్తి, రెడ్‌క్రాస్ సభ్యులు బి.సతీష్, సాయి సుధాకర్ పాల్గొన్నారు.

పొందూరు: మధుమేహ (చక్కెర) వ్యాధిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని ఆప్తాలమిక్ అధికారి, రోటరీయన్ సప్పటి వసంతరావు అన్నారు. స్థానిక సిస్టమ్ కళాశాలలో మంగళవారం ప్రపంచ చక్కెరవ్యాధి దినోత్సవం సందర్భంగా మధుమేహ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. ఈ వ్యాధి ఉన్నవారు తప్పకుండా మందులు వాడుతూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గ్రామస్థాయిలో ప్రజలు పడుతున్న బాధలను, పరిస్థితులను స్వయంగా పరిశీలించి అక్కడ సమస్యలను గుర్తించి పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించడానికే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పల్లినిద్ర కార్యక్రమం చేపట్టారని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలో నిజర్జంగి పంచాయతీలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యారాధాల ఆధ్వర్యాన మంగళవారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవడం, పరిష్కారానికి కృషి చేయడంలో జగన్ ఎప్పుడూ ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా



సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న వాణి

క్షేత్రస్థాయిలో పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులు పల్లెనిద్ర ద్వారా గుర్తించి ఆ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, రామకృష్ణ, జెఎస్‌సి మండల కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, కవిటి రామరాజు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

50 మంది రక్తదానం

ప్రజాశక్తి- కవిటి

పరమేశ్వర ఎలక్ట్రికల్ షాప్ ఆధ్వర్యాన తలసేమియా బాధిత చిన్నారులకు ఉద్దానం బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో కవిటిలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా బాధితులకు అండగా నిలిచారు. సోంపేటకు చెందిన డాక్టర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, బల్లెడ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

బియ్యం అందజేత

ప్రజాశక్తి- పలాస

పలాస మదర్ థెరీసా పాఠశాల విద్యార్థులు ప్రతి వారానికీ ఒకసారి తీసుకువచ్చిన బియ్యాన్ని సేకరించి 80 కేజీల బియాన్ని కాశీబుగ్గ లలితా ఛారిటబుల్ ట్రస్టుకు పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, విద్యార్థులు మంగళశారం అందజేశారు. ఈ సందర్భంగా వజ్జ గంగా భవాని మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టాలనే ఉద్దేశంతో విద్యార్థుల నుంచి బియ్యం సేకరించి ట్రస్టుకు అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు పాల్గొన్నారు.

జనసేన ఇన్‌ఛార్జిగా దుర్గారావు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గ జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీతో సమావేశాల నిర్వహణ, సంప్రదింపుల సమన్వయ బాధ్యునిగా డాక్టర్ దుర్గారావుని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియమించారు. నియోజకవర్గ బాధ్యునిగా బాధ్యతలు అప్పగించినందుకు పవన్ కళ్యాణ్‌కి, పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు హదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో నాకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. చిత్తశుద్ధితో నిస్వార్థంగా జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ కూటమి గెలుపుకు కృషి చేస్తానని అన్నారు. నియోజవర్గంలో జరుగుతున్న భూ ఆక్రమణలు, అధికార పార్టీ చేస్తున్న అవినీతి అక్రమాలపై పోరాడి ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలబెడతామని చెప్పారు.

దుస్తుల పంపిణీ

ఇచ్ఛాపురం : టిడిపి బిసి సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంఘలవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అశోక్ పాల్గొని పేద మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే అన్నదానంలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక వెంకటేశ్వర విద్యా సంస్థలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జి.ఢిల్లేషు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, తవిటయ్య, దిలీప్‌కుమార్, నందిక జాని, కోటి, ధర్మరాజు, జన్నెల సంతోష్, మణిచంద్ర పాల్గొన్నారు.

24న హంసనావికోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయ పరిధిలో ఈ నెల 24న హంసనావికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇఒ హరి సూర్యప్రకాష్‌లు తెలిపారు. క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్ర పుష్కరణిలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అత్యంత వైభవంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముందుగా దేవేరుల ఊరేగింపు ఉత్సవం జరుగుతుందని, సందర్శకులు పెద్దసంఖ్యలో హాజరు కానున్నట్టు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ఐటీవింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జగనన్న ప్రగతి పదానికి సంబంధించి పోస్టర్‌ను మంగళవారం స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద స్పీకర్ తమ్మినేని సీతారాం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయలేని మంచి కార్యక్రమాలను సిఎం జగన్మోహన్ రెడ్డి నాలుగున్నర ఏళ్లలో చేశారన్నారు ఈ ప్రభుత్వంలో జరిగిన మంచిని రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని ఐటీవింగ్‌ను ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీవింగ్ సెక్రెటరీ శశిభూషణరావు, జాయింట్ సెక్రెటరీ గురుగుబెల్లి గురు రామ్‌చరణ్, మండల యూత్ అధ్యక్షులు ముత్తా విజయ్, శివప్రసాద్, పడాల రమేష్, ఆవాల శేఖర్, సనపల సన్యాసిరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారానికి ఆ సంఘం అధ్యక్షుడు త్రినాధరావు కృషి చేయాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సాకేటి నాగరాజు పేర్కొన్నారు. పొందూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఇటీవల విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన రాపాక విఆర్ఎ తెండేల త్రినాధరావుకు దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక సంఘ సభ్యులు రాజేష్, తులసి, గోపి, విఆర్ఎలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం అర్బన్: అంతర్జాతీయ అకౌంట్స్ డే సందర్భంగా గంది చిన్న సన్యాసి రాజు డిగ్రీ కళాశాలలో ఫెస్ట్ కాంపిటేటివ్ పోటీల్లో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కళాశాల వాణిజ్యశాఖ విద్యార్థినులు పాల్గొని క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి, పోస్టర్ పెయింట్ పోటీల్లో ద్వితీయ బహుమతి, పిపిటి ప్రెజెంటేషన్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, వాణిజ్యశాఖ విభాగాధిపతి ఎల్. కృష్ణారావు, అధ్యాపకులు లలితా బాయ్, సంతోషి పట్నాయక్, పావని అభినందించారు.

కవిటి: గుంటూరు జిల్లా పెదకాకానిలో ఈ నెల 15 నుంచి జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం జిల్లా పరిషత్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుమలత తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో మంగళవారం అభినందించారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కవితా కుమారి సాహు, నాగసెట్టి కీర్తి అండర్-17 బెస్ బాల్ విభాగంలో పాల్గొంటారని అన్నారు. వారిని ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.తోటారావు, రవికుమార్, మహంతిలను అభినందించారు. అలాగే ఎంపికైన క్రీడాకారులకు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, పిఎసిఎస్ చైర్మన్ దేవరాజ్ సాహు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం

టెక్కలి రూరల్ : మేజర్ పంచాయతీ టెక్కలి ఇంటి పన్నులను వేగవంతం చేయాలని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను మంగళశారం తనిఖీ చేశారు. ఇంటి పనులు వసూళ్ల రసీదులు సక్రమంగా ఉన్నాయా? లేవా? అనేది పరిశీలించారు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించాలన్నారు. కార్మికుల పిఎఫ్ చెల్లించాలని ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావుకు ఆదేశించారు. పంచాయతీ ఆదాయాన్ని మెరుగుపరిచి అభివృద్ధిలో పయనించాలన్నారు.